# "గంధర్వ గోత్రం"

"హల్లో! గుడ్‌మార్నింగ్ రాము!

వెరీ గుడ్‌మార్నింగ్!" బెడ్‌మీది నుండి లేస్తూనే, శ్రీహరి కేకలు పెట్టాడు. చలికాలం కావడంతో కిటికీ తలుపులన్నీ మూసుకొని పండుకొన్నారేమో, వుదయం ఎనిమిది గంటలైనా గది చీకటిగా వుంది.

రాము వైపునుండి సమాధానం లేదు. వెంటనే శ్రీహరి వో కార్నర్‌కెళ్ళి లైట్‌స్విచ్ వేశాడు. ఆ వెలుతురులో తన పక్క బెడ్ ఖాళీగా కనుపించింది.

"ఛీ! పూర్‌ఫెలో! యెప్పుడూ యింతే! టైమ్‌కి వుండడు." అంటూ తన బెడ్‌ని చుట్టి వో మూల పడేసి గబగబా బయటికి పరుగు పెట్టాడు

తోటి విద్యార్థులంతా డైనింగ్ హాల్ వేపు వెళుతూన్నారు. శ్రీహరికి నిరాశ కల్గింది. వోసారి రిస్ట్‌వాచ్‌వంక చూశాడు. సరిగ్గా యెనిమిది దాటి పక్క నిమిషమైంది. అంటే తనకు విషయం తెలిసి యిప్పటికి నాలుగు గంటలన్న మాట! ఫోర్! లక్కీ స్టార్: లక్కీ నంబర్ ఫోర్! ఈరోజుతో పూర్‌నెస్‌కి బై-బై. "పూర్ ఫెలోస్! సమయానికి పక్కడులేడు. ఈ రాముగాడైనా రూమ్‌లో యేడ్వగూడదూ! వాడొక దరిద్రుడు. కోడి కూసినప్పుడే లేస్తాడు. అన్నీ లేబర్ అలవాట్లు. నాలా యించక్కా రాయల్‌గా యెనిమిది గంటల వరకూ నిద్రపోకూడదూ! పోనియ్యి! వాడి కర్మకెవరేం చేస్తాం?" విచారంగా అనుకుంటూ హాస్టలులోని ఒక్కో రూమ్ చూస్తూ ముందుకు సాగాడు.

అన్ని గదులు తాళాలు వేయబడి వున్నాయి. "ఛీ-ఛీ! అంతా లేబర్ గాళ్ళయ్యారు. రాయల్‌గా వుండేవాడొక్కడూ లేడు. వీళ్ళేం డాక్టర్లవుతారు రేపు?" స్వగతంగా అనుకుంటూనే ముందుకు వెళ్తున్నాడు.

"హల్లో! గుడ్‌మార్నింగ్ టూయూ శ్రీహరి?" యెదురుగా వున్న రూం కిటికీ నుండి అప్పుడే నిద్ర లేచిన రాజన్ స్వరం విన్పించింది. శ్రీహరి ఆనందంగా చూచాడు. ఒక్క పరుగున లోపలికి దూరాడు రాజన్ చేతిని తన చేతుల్లోకి తీసుకుని గట్టిగా నొక్కుతూ "వెరీ-వెరీ గుడ్‌మార్నింగ్ టూయూ!

---

ప్రణవి, యస్.

---

ఇంతకీ నీవు నిద్ర లేవగానే యెవరి మొహం చూశావు ?" ఆత్రంగా అడిగాడు.

"నీ ముఖమే ? శ్రీహరి ముఖం!"

"ఆహా ? ధన్యుడవోయ్. నీ అంత అదృష్టవంతుడు యీ హాస్టల్లో యెవరున్నారు ? అదృష్టం వెతుక్కుంటూ నీ దగ్గర కొచ్చింది. ఇంకా మనకి మరో యిద్దరు అదృష్టవంతులు కావాలి: కమాన్-కమాన్. త్వరగారా!" వున్న పళంగా బయటికి లాగాడు.

రాజన్ కేమీ అర్థంకాలేదు. అలాగే బయటికి వచ్చాడు. లుంగీ సరిచేసుకుంటూ "యేమిటి బ్రదర్ ! సంగతేమిటి ?" అడిగాడు.

"అదుగో అదే వద్దన్నా. అంతా లేబర్ బుద్ధులేమయ్యా మీవి ? అంత యాంగ్జైటీ పనికిరాదు మిత్రమా ! రాయల్‌గా వుండండి. ఇంకొంచెం సేపట్లో అంతా చెప్పనూ ? కమాన్ ? ముందు యిద్దర్ని పోగుచెయ్యాలి !"

ఆ మాటలతో రాజన్‌కికూడా ఉత్సాహమొచ్చింది హాస్టల్లోని మిగిలిన రూమ్‌లన్నీ గాలించారు. మేడపైన చివరి గదిలో ఇద్దరు అదృష్టవంతులు ముసుగు పెట్టుకొని నిద్రపోతున్నారు.

"ఆహా ! సాక్షాత్ రాజకుమారుల్లా వున్నారు. యేం రాయల్‌నెస్ వారి పడకలో !" శ్రీహరి మెచ్చుకొన్నాడు, ఇద్దరూ కలసి నిద్రపోతున్న యిద్దర్నీ కుదిపి లేపారు.

"గుడ్‌మార్నింగ్ టూయూ ! వెరీ గుడ్‌మార్నింగ్ ! మిస్టర్ గురుపాదం, మిస్టర్ దేవదానం ! కమాన్ గెటప్!" బలవంతాన యిద్దర్నీ కూర్చోబెట్టారు. కూర్చున్నారు అలాగే కళ్ళు మూసుకొనే, క్రైస్తవ సాంప్రదాయం ప్రకారం ప్రార్థన చేసుకొని కళ్ళు తెరిచి, యెదురుగా వున్న అదృష్ట దేవుళ్ళను చూశారు.

"గుడ్‌మార్నింగ్ టూ యూ !" అంటూ లేచి, "యేం బాబూ ! యింత పొద్దున్నే యిటు వేంచేశారు ?" గురుపాదం అడిగాడు.

"మేం రావడం కాదోయ్! అదృష్ట దేవతలు మీ ముందున్నారు" రాజన్ అన్నాడు.

"యేం డాక్టర్‌వయ్యా నువ్వు ! సెక్స్‌కూడా మరిచిపోతున్నావు. అదృష్ట దేవత స్త్రీలింగం, నీవు కూడా ?" దేవదానం అన్నాడు.

"బ్రదర్ ! వాదానికిది సమయం కాదు, ముందు మనం వో రహస్య సమావేశం యేర్పరచుకొందాం, నెక్స్ట్ 'మండే'కి మనంనలుగురం లక్షాధికారులం, తెలుసా ?" శ్రీహరి చిన్నగా అన్నాడు.

"యేమిటీ ? యీజిట్ ఫాక్ట్ ?" గురుపాదం విస్తుపోయాడు.

"నిజం గురూ! యీవేళ 'ఫ్రైడే.' యీ రోజు తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో నాకు అద్భుతమైన కల వచ్చింది" శ్రీహరి చెప్పసాగాడు.



"కలా? తెల్లవారుజామునా? తెల్లవారు జాము కలలు నిజమౌతాయని మా జేజి అనేది. త్వరగా చెప్పు! మనం లక్షాధికారుల మవుతామా?" గురుపాదం అన్నాడు.

"బ్రదర్? యెవ్వరూ వినటం

లేదుకదా. మీరు శ్రద్ధగా వినండి. రాత్రి నిద్రలో అంటే తెల్లవారు జాము నాలుగు గంటలైయ్యుంటుంది. ఆసమయాన యిద్దరు గంధర్వులు ముందు, మరో యిద్దరు వెనుకగా నిలపడి వో బంగారు పల్లకి మోసుకొచ్చి, నా ముందుంచారు. నేను లోపలికి తొంగి చూశాను. ఆహా! యేం అందం గురూ! లోపల యెంత శోభగా వుందో తెలుసా?" శ్రీహరి చెబుతున్నాడు.

"ఏమిటది? అమ్మాయేం? మైగాడ్!" రాజన్ ఆశ్చర్య పడ్డాడు.

"నేను ఆశగా చూశాను. అందుకో బోయాను. కానీ, గంధర్వులు నన్నందుకో నివ్వలేదు. "మేమెందరం?" అన్నారు. ఏమో? గంధర్వుల నెవరు నమ్ముతారు? ఇంతలో వారే అన్నారు. "నలుగురం కదూ?" అని. అవునన్నాను. వెంటనే పల్లకీలో యింపుగా మెరిసిపోతూన్న బంగారపు "నాలుగు' సంఖ్యను తీసి నా మెళ్ళో వేశారు. అబ్బ! ఆ బరువు నేను మోయలేక పోయాను. ఆశ్చర్యపడి వారికి కృతజ్ఞతలు చెబుదామనుకొని వారివంక చూశాను. ఇంకెక్కడి గంధర్వులు? నలుగురూ నాలుగు పంచకళ్యాణులై పరుగు లంకించుకున్నారు. పల్లకి మాత్రం నావద్దే వుంది. నేను మళ్ళీ బంగారపు నాలుగు సంఖ్యను మెల్లగా తీసి, పల్లకీలోనే వుంచాను. ఈలోగా నాకేదో ఆలోచన వచ్చింది. కళ్ళు తెరిచాను. అంతా కరిగిపోయింది." అని, సాలోచనగా మిగిలిన ముగ్గురి వంకా చూశాడు.

"అయితే నలుగురూవచ్చి నాలుగు తెచ్చి నీకు అప్పించారన్నమాట!" దేవదానం ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును. దాని అర్థం మీ కెవరి కన్నా తెలిసిందా? బాగా వినండి. నాకు కల వచ్చింది నాల్గింటికి? కనిపించింది నలుగురు. అప్పించింది నాలుగు. తిరిగి వెళ్ళింది నాలుగు గుర్రాలు. కల కరగిపోయాక నాల్గ గంటలకి లేచి మీవద్ద కొచ్చాను. అంటే యేమిటి? అంతా నాలుగు మయం. మీకు గుర్తుందికదూ. ఈమధ్య వో వెటసినరి కాలేజి స్టూడెంట్‌కి హార్స్‌రేస్‌లో యెనిమిది లక్షలొచ్చాయి. మనం మెడికల్ కాలేజ్ స్టూడెంట్సుం కనుక యీసారి ఆ అదృష్టం మనకి పట్టబోతుంది. ఇది నిజం. మనం గతంలో రెండుసార్లు ఓడిపోయాం, అవ్‌కోర్సు! అప్పుడు మీరు నా పార్ట్‌నర్స్ కాదనుకోండి. అయితే మాత్రమేం! మీరు అదృష్టవంతులు! కనుకనే యీసారి నాపార్ట్‌నర్ రాముగాడు మిస్సయ్యాడు. కాబట్టే నేడుమిమ్మలనువెతుక్కుంటూ వచ్చాను. నాకు కల వచ్చింది శుక్రవారం. దివ్యమైన రోజు. అన్నీ బాగా కుదిరాయి. ఆదివారం నాటికి యెలాగైనాసరే మనిషికి వంద

రూపాయల చొప్పునపోగుచేసి నాలుగు వందల రూపాయలు, నాలుగో నంబర్ గుర్రంమీద కట్టి, మనం లక్కీ ఛాన్స్ కొట్టాలి. ఈ విషయం ఎవ్వరికీ తెలీ కూడదు. చాల సీక్రెట్ ! ఏమంటారు" శ్రీహరి అడిగాడు.

వో క్షణం గదిలో నిశ్శబ్దం తాండ వించింది. మిగిలిన ముగ్గురూ ఆలో చించుతున్నారు. ఆ రోజు యిరవై నాలుగో తారీఖు, చేతిలో డబ్బులేదు. ఎవరినడ్డయినా తీసుకోవాలి. ఎందు కంటారేమో, ఈ విషయం మాత్రం చెప్పరాతదు,

"గురూ ! ఇప్పుడు డబ్బులేదుకదా! యెలా మరి ?" రాజన్ అడిగాడు.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఎవర్ని అడిగినా, పదిరకాల ప్రశ్నలు వేస్తారు. పోనీ ఇలా చేస్తే ? అందరి వద్ద వాచీలు, వుంగరాలు వున్నాయిగా? వాటిని తాకట్టుపెట్టి మనిషికో నూట పాతిక తీసుకుంటేసరి అంతా మళ్ళీ మనం పందేకి సర్దేస్తాంకదా ! వాచీ యేదని ఎవరన్నా అడిగితే రిపేర్ కిచ్చామని చెప్పవచ్చు !" శ్రీహరి వుపాయం,

"వెరీగుడ్ ! అలాగే గురూ ! మెనీ మెనీ థాంక్స్. మనం ఈ చదువు పూర్తిచేసి కట్నంగా కొంత, ప్రాక్టీ సులో కొంత సంపాయించినా లక్ష రాదు. నీ ఐడియా బెస్ట్. అలాగే 'సాటర్ డే' ఈవినింగ్‌కి కాష్ నీచేతిలో పోస్తాం." రాజన్ అన్నాడు.

"ఓకే ! కానీ సీక్రెట్ లీక్ చెయ్య కూడదు బ్రదర్ !" శ్రీహరి హెచ్చరిక.

"ఓయస్ ! పోదాంరా !" రాజన్ బయటికి దారి తీశాడు.

"విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్, గురు పాదమ్ అండ్ దేవదానం."

"థాంక్యూ" ఇద్దరూ ఒకేసారి అన్నారు. మొదటి యిద్దరూ వెళ్ళి పోయారు.

• • •

సాయంత్రం నాలుగు కొట్టింది. ఆ రోజు శనివారం. నలుగురూ వోచోట సమావేశమయ్యారు. నాలుగు వందలు కలిపారు. "ఈ నాలుగు వందలూ నంబర్ ఫోర్ మీద, ఫోర్త్ రవుండ్‌లో కట్టాలి. యేమంటారు ?" శ్రీహరి అడిగాడు.

"ఓయస్ ! అలాగే !" మిగిలిన ముగ్గురూ తలలూపారు,

ఆ రాత్రి నలుగురూ నిద్రపోలేక పోయారు. రేపటి రేస్‌లో తమకు రాబోయే లక్షలతో యేం చేయాలి ? అందమైన బిల్డింగ్, అంతకంటే అందమైన భార్య, ముచ్చటైన కారు. ప్రాక్టీస్ యేరోజుకైనా చెయ్యడానికి వో బ్యూటిఫుల్ క్లినిక్, వూహలలో తేలిపోతున్నారు.

మొత్తానికి వో యుగం గడిచినట్లు తెల్లవారింది. నలుగురూ కాలకృత్యాలు తీర్చుకొని చర్చికి, దేవాలయానికి వెళ్ళారు. మనసారా ధ్యానించారు. మనసులోనే మొక్కుకున్నారు.

"బదర్! నేను డబ్బురాగానే, మన ఫ్రెండ్స్ నలుగురికి అంటే మీరు కాకుండా, దానం చేయాలను కుంటున్నాను. దానమంటే, ఆ సమ యానికి వారికేది అవసరమో, అది వారికి తెలియకుండానే తెప్పించి యివ్వడం. అలాగే మీరుకూడా చేస్తే చెయ్యండి. ఒక్కొక్కరూ నలుగురికే దానం చెయ్యండి." శ్రీహరి సలహా యిచ్చాడు.

"వెరీగుడ్ ఐడియా? సరే. మనం ఎన్ని గంటలకు బయల్దేరాలి? రాజన్ అడిగాడు.

"పన్నెండు గంటలు కొట్టాక, సరిగ్గా నాలుగు నిమిషాలకి మనం నలుగురం ఒకేసారి స్టెప్స్ బయటకు వెయ్యాలి! ఓకే?"

"ఓకే!" నలుగురు లాడ్జికి బయల్దేరారు.

నలుగురూ సహపంక్తిని కూర్చుని భోజనాలు ముగించారు. వారి వారి గదులకెళ్ళి బట్టలు మార్చుకొన్నారు.

"పిక్చర్ కొస్తావా గురూ?" రాము శ్రీహరి నడిగాడు.

"లేదు బ్రదర్! ఈవేళ కొంచెం పనుంది. బయటి కెళ్తున్నాను. అవును గానీ, అదేవిటి నీ షూస్ అలా అయ్యాయి? ఛఛ! ఎలా వాడు తున్నావు వాటిని? విసిరి అవతల పారెయ్!" శ్రీహరి అన్నాడు.

"వీటినా? నీకేమన్నా పిచ్చా? వీటికేం? కాస్త పాలిష్ కొడితే నిగ నిగ లాడవూ? అఫ్‌కోర్స్ వీటిని కొని రెండేళ్ళయ్యిందనుకో, ఇప్పుడు కొన గలిగేంత పైకంలేదు గురూ!" విచారంగా అన్నాడు.

"యుడోంట్ వర్రీ, ఐసీ! నీకు 'మండే' నాటికి వో అంబాసిడర్ బూట్ల జత ప్రజెంట్ చేస్తాను." హామీ యిచ్చాడు శ్రీహరి.

"అదేవిటి? ఖర్మగాలి ఈవేళ యేమైనా మారేజ్ కెళ్తున్నావేమిటి?" రాము పరిహాసించాడు.

"ఛీ ఛీ! సిల్లీ! మనమేం దొంగలమా, మారేజ్‌లో షూస్ తేవడానికి? సోమవారంనాడు యిదే వేళకి నిన్ను బాటా కంపెనీకి తీసుకెళ్ళి, కొత్త అంబాసిడర్ కొనిస్తాను. కావాలంటే యిదో ప్రామిస్!" శ్రీహరి రాము చేతిలో చెయ్యేసాడు.

"భగవాన్! నేను నమ్మలేక పోతున్నా. ఆకాశవాణి గాబోలు ఏదో వాగ్దానం చేస్తూంది." రాము పైకి చూస్తూ, ఆశ్చర్యపడుతున్నాడు.

"ఒరేయ్ వెధవా! ఆకాశవాణి కాదురా, శ్రీహరి పలుకులురా! నమ్మితే నమ్ము. లేకపోతే పో!" శ్రీహరి విసురుగా బయటికి సాగాడు.

దారిలో యెదురైన వారిలో మరో ముగ్గురికి "ట్రాన్సిస్టర్" "టేప్ రికార్డర్" (పోర్టబుల్), "కెమేరా"లు బర్మా బజారులో సోమవారంనాడు స్వయంగా కొనిస్తానని మాటిచ్చాడు.

అలాగేమిగిలిన ముగ్గురూ నియమం

తప్పకుండా వాగ్దానాలుచేసి, పన్నెండింటికి హాస్టల్ గేటువద్ద కలుసుకున్నారు.

కరెక్ట్ టైం వారికి తెలుసుకొనే అవకాశం లేకపోయింది. నలుగురూ అవస్థపడుతున్నారు. వాచ్‌మన్‌ని టైం అడిగారు. అతని గడియారం పన్నెండున్నర చూపుతుంది.

"హతోస్మి. యిదేమిటి? ఆదిలోనే హంసలెగ్" అనుకొని యెవరో దారే పోయేవానన్య నడిగార్లు. అతను పన్నెండన్నాడు. మళ్ళీ వూపిరి పీల్చుకొని వాచ్‌మన్‌ని చివాట్లేశారు. ఇంతలో అటుగా వస్తూన్న వో డాక్టర్‌కి విష్‌చేసి టైమడిగారు. పన్నెండుం బావన్నాడాయన. మళ్ళీ దిగులు పుట్టింది. యేది సరైనటైం? ఛ ఛ ఛ! అన్నీ తప్పుడు గడియారాలే." నలుగురం కలిసి ఫౌంటెన్ టైంపీస్ వాచ్‌మన్‌కి యివ్వడం చాల అవసరం" శ్రీహరి అన్నాడు. అందుకు మిగతావారు తలలూపారు.

"హలో! టాక్సీ టాక్సీ! అరె, ఆగు!" దేవదానం గట్టిగా కేకపెట్టాడు. మిగిలినవారు విస్తుపోయారు. "మన పక్కనే స్టేషన్ వుందికదా హాయిగా. ఎలక్ట్రిక్ ట్రైన్‌లో వెళ్ళొచ్చ"ని కోప్పడ్డారు.

"అది కాదోయ్! దద్దమ్మలారా! ఆ టాక్సీ నంబర్ చూడండి!" దేవదానం అన్నాడు

ముగ్గురి కళ్ళూ వక్కసారి మెరిశాయి. "హా! లక్కీ నంబర్! ఫోర్-ఫోర్స్! కమాన్! కమాన్!" ముందుకు పరుగు పెట్టాడు శ్రీహరి. మిగిలినవారు నలుగురూ యెక్కికూచ్చున్నారు. దేవదానం ముగ్గురి అభినందనలూ అందుకొని ఆనందంగా వెనక్కి వాలాడు.

"గిండీరేస్ కోర్సుకి పోనియ్యి డ్రైవర్!" శ్రీహరి ఆజ్ఞాపించాడు. డ్రైవర్ ఓ క్షణం విస్తుపోయాడు. తర్వాత, "గిండీకి రావడానికి మీటర్ ఛార్జీకి రెట్టింపివ్వాలి! లేకపోతే నాకు తిరిగిరావడానికి బాడుగ వుండదు!" శ్రీహరిని అడిగాడు.

ఓ క్షణం నలుగురూ ఆలోచించారు! చాల యెక్కువ డబ్బు యివ్వవలసి వస్తుంది. అయితేమాత్రం? ఇలాంటి నాలుగు_నాలుగులునంబరున్న టాక్సీ యెక్కడ దొరుకుతుంది? కేవలం భగవంతుడే పంపి స్తాడు. నలుగురూ కళ్ళతో సంభాషించుకున్నారు.

"ఆల్‌రైట్! పోనియ్యి డ్రైవర్! తలుచుకొంటే నీ టాక్సీని కూడా కొనేస్తాం, సాయంత్రం!" శ్రీహరి ధీమాగాచెప్పాడు. డ్రైవర్ మీటర్‌ను ఆన్‌చేసి ఇంజన్ స్టార్ట్ చేశాడు.

నలభై నాలుగు నిమిషాలకి గిండీ చేరింది టాక్సీ. పదిరూపాయల నలభై పైసలయ్యింది మీటర్‌ఛార్జీ. దానికి రెట్టింపువేసి డ్రైవర్‌కిచ్చారు. శ్రీహరి రాజఠీవితో ముందుకు నడిచాడు. మిగిలినవారు అనుసరించా

నలభై నాలుగవ నంబరు కౌంటర్ కెళ్ళి, నాలుగువందల రూపాయలు నాలుగవ రేస్‌లో, నలుగవ నంబర్ గుర్రంమీద కట్టారు. కౌంటర్ క్లార్క్ వారి అంచనాకి ఆశ్చర్య పడి పోయాడు. ఆ గుర్రంమీద అంత వరకూ ఏ ఒక్కరూ కట్టలేదు. ఆ సంగతే పక్కనున్నవారిలో శ్రీహరికి వినిపించేలా అన్నాడు.

"థాంక్ గాడ్! మాకు అదే కావాలి! చూశారా కామ్రేడ్స్ మనం కాసిన గుర్రంమీద మరెవ్వరూ కాయ లేదు. ఈ రోజు లాట్ మనదే!" సంతోషంగా అన్నాడు శ్రీహరి. మిగతా వారికీ ఆనందం కలిగింది. తర్వాత టిక్కెట్లు కొనుక్కొని లోపలికి కెళ్ళి గాలరీలో కూర్చున్నారు.

రేస్ ప్రారంభమైంది. మొదటి రౌండు, రెండు, మూడు ముగిశాయి. నాలుగవ రేస్‌కు గుర్రాలు సిద్ధమయ్యాయి.

"ఏం గురూ! మన నంబర్ ఫోర్ గాడిదలావుంది!" రాజన్ దిగులుగా అడిగాడు.

"అదే బ్యూటీ! అందుకే దాని నెవ్వరూ ఎక్స్‌పెక్టు చెయ్యరు. ఈ రౌండులో చూడు! అది ఫస్టొచ్చి, జాక్‌పాట్‌వాళ్ళ బొచ్చిలో బొమ్మరాయి కొడుతుంది" శ్రీహరి రహస్యంగా అన్నాడు.

గుర్రాలమీద కూర్చున్న జాకీలు హుషారుగా వున్నారు. గుర్రాలను జనానికి పరిచయం చేశారు. పిమ్మట పందేనికి సిద్ధపడ్డారు.

తుపాకి ఆకాశంలోకి ప్రేలింది. శబ్దం జనం చెవులకు సోకేలోగా గుర్రాలు నాలుగు అంగలు ముందుకు దూకాయి. రామబాణమో, తుఫానో, ఎక్స్‌ప్రెస్సో, రష్యన్ రాకెట్టో, ఆకాశంలో మెరుపో తెలియకుండా వుంది వాటి పరుగు ప్రాభవం. దుమ్ములేచి, పత్తర గోగ్రహణం గుర్తుకుతెస్తోంది. గుర్రాల గిట్టల సవ్వడి వీనుల విందుగా వుంది. క్షణాలు గడిచిపోతూన్నాయి. దూరం తరిగిపోతూంది. జాకీల చేతులలో కొరడాలు చళ్-చళ్ మంటున్నాయి, వారి నోటినుండి యేవో తమాషా శబ్దాలు మార్మోగుతున్నాయి. కోలాహలంగా ద్విగుణీకృతోత్సాహంతో పరికిస్తున్న ప్రేక్షకులలో జాక్‌పాట్ వాలాల రక్తం గుర్రాలకంటే వేగంగా పరిగెడుతోంది.

గుర్రాలు మొదటివంపు తిరిగాయి. లక్కీ నంబర్ ఫోర్ అన్నిటికంటే ముందుకొస్తుంది. నంబర్ ఫైవ్, టూ, త్రీ దానిని దాటాలని విశ్వప్రయత్నం చేస్తున్నాయి.

రెండోవంపు తిరిగాయి నంబర్ త్రీ ముందుకొచ్చింది. జనం గోల పెడుతూన్నారు. ఈలలేస్తూన్నారు. పక్కవాడిని లెక్కచేయడంలేదు. నోటికొచ్చినట్టు వాగుతున్నారు.

గుర్రాలు మూడో వంపు కొస్తున్నాయి. జాకీలు యెగిరెగిరి పడు




తున్నారు. గుర్రాలు పంగల మీద అంగలు వేస్తూ గాలిని చీల్చుకు వస్తున్నాయి.

అడ-మగ నోటికొచ్చినట్లు జాకీలను తిడుతున్నారు. ఫేవరెట్‌లు రావడం లేదని మండిపోతున్నారు. ఇంతలో మూడో మలుపు దాటాయి. నాలుగో నంబర్ జానెడు ముందుకు పసగెడుతోంది.

గాలరీల్లోని జనమంతా చప్పబడి పోయారు. శ్రీహరి బృందం ఆనందం మిన్నుముట్టింది. నలుగురిలో మిగిలిన ముగ్గురూ తమకళ్ళను తామే నమ్మలేక పోతూన్నారు.

వెనుకనించి యెవరో కేకలేస్తున్నారు "ఆ నాలుగో నంబర్ గాడిదని చంద్రా! అది గుర్రం కాదు. అన్నిటి

కంటే ముందుకొస్తుంది? ఆ జాకీగాడ్ని కాల్చండి!"

"నోర్ముయ్! వాడు జాకీకాదు. కృష్ణభగవానుడు. అది గాడిదకాదు, గుర్రంకాదు. మా అదృష్ట దేవత! కమాన్! కమాన్! రాముందు!" శ్రీహరి పిచ్చిగా అరుస్తూన్నాడు.

గుర్రాలు గోల్ సమీపించాయి. జనం మరోసారి లేచారు. ఆకాశం పురిమినట్లు గోలపెట్టారు. ఈలలేశారు. చప్పట్లు చరిచారు. భారతదేశంలో వున్న అన్ని భాషల్లోను గుర్రాలను, జాకీలను హుషారు పరిచారు.

గుర్రాలు దమ్ము బిగపట్టాయి. [illegible]ంము [illegible]నాలనే జాకీలతాపత్రయాన్ని పసిగట్టాయి. మరింత వుత్సాహంతో ముందుకురికాయి. ఒక్క క్షణంలో గోల్ దాటేశాయి. రేస్ కోర్స్ కెమేరాలు గోల్ కి యెదురుగా గుర్రంరాగానే క్లిక్ మన్నాయి.

జనం పిచ్చివారై పోయారు. "ఆ-వూ" లనంటి అర్ధం-పర్ధంలేని కేకలు, చప్పట్లు, యీలలు వేస్తున్నారు. జాక్ పాట్ వాలాలు అర్ధరహితంగా అరుస్తూన్నారు. డబ్బులు-విడిపందేలలో కట్టినవారు మార్చుకుంటున్నారు. లక్షలాది జనం ఆనంద సాగరంలో కొట్టు-మిట్టాడుతున్నారు.

కానీ, నలుగురుమాత్రం జనాన్ని తప్పించుకొని, బయటికి మౌనంగా నడిచిపోతూ వున్నారు. నెత్తురు చచ్చిన ముఖాలను వుత్సాహంతోవున్న ప్రేక్షకులు పట్టించుకోవడంలేదు.

ఐదవ నంబర్ గుర్రం ప్రథమ శ్రేణిలో, మూడు ద్వితీయ, ఒకటి తృతీయ, రెండు పంచమ శ్రేణిలో వచ్చాయి. లక్కీ నంబర్ ఫోర్! గంధర్వ గుర్రం, కృష్ణసారథ్యంలో లెక్క తప్పకుండా నాల్గవ శ్రేణిలోకి వచ్చింది. గంధర్వులు చూపిన నాల్గవ స్థానాన్ని అది దాటలేదు.

బయటికి వచ్చిననలుగురు విద్యార్థులకు, టాక్సీ నంబర్ నాలుగు-నాలుగులుకూడా ఓ ప్రక్కన కనిపించింది.

హుషారుగా గంతులేస్తున్న టాక్సీ డ్రైవర్ శ్రీహరి బృందాన్ని గుర్తించాడు. "సార్! జాక్ పాట్ లో నావి నాలుగు నంబర్లు కలిశాయి. ఇంకొక్కటే కలవాలి! మీదేమైంది?" అడిగాడు. శ్రీహరికి ఏడుపొచ్చినంత పనైంది. "విష్ యు బెస్ట్ ఆఫ్ లక్" గాద్గదికంగా అంటూ, గిండీస్టేషన్ వైపు దారితీశాడు.

•••